మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



## కేసీఆర్ ఆనవాళ్లు మాపలేరు..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

3

సంపుటి : 01 | సంచిక : 183 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 03 జూన్ 2026 | పేజీలు : 5



# ఆవిర్భావం.. అదిరింది

## ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడి
- ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందిస్తామని హామీ

2

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అంగరంగవైభవంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షా లోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి పూలు సమర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ప్రగతిపై సందేశాన్నిచ్చారు.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి














# ఆవిర్భావం అదిరింది

- ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడి
- ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందిస్తామని హామీ



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అంగరంగవైభవంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి పూలు సమర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ప్రగతిపై సందేశాన్నిచ్చారు.తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచస్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ 2047 దృక్పథంతో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయని తెలిపారు. జనగామ జిల్లా తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన ప్రాంతమని పేర్కొంటూ, వీరనారి చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నాయని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, ఇందిరా మహిళా శక్తి, ఆసరా పెన్షన్లు, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మత్స్య, చేనేత, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటి పారుదల, తదితర శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం చూపుతున్న నిబద్ధత అభినందనీయమన్నారు.

అనంతరం మైత్రేయ కూచిపూడి వారి గణపతి కౌత్వం, కేజీబీవీ లింగాల ఘనపురం వారి జానపద నృత్యం, సాన్ మారియా పాఠశాల వారి భరత వేదమున, కేజీబీవీ నర్మెట్ట వారి అసైదుల్లా హారతి పాటలకు వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన గేయాలకు కేజీబీవీ విద్యార్థులు చేసిన నర్తనలు వీక్షకులను అలరించాయి. తదనంతరం పలు సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ కింద చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్యలో (953) స్వయం సహాయక సంఘాలకు గాను రూ. 71,94,00,000, అలాగే స్త్రీ నిధి రుణాల కింద చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్యలో (191) స్వయం సహాయక సంఘాలకు గాను రూ. 4,90,00,000, అదే విధంగా రబీ, ఖరీఫ్ 202425, 202526 కు గాను పీపీసీ కింద చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్యలో 12 మండలాల్లోని 332 గ్రామ సంఘాలకు సంబంధించి రూ. 3,21,67,747 చెక్కులను అందజేశారు. ఆ తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద (96) మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, అలాగే రెండు పడక గదుల కింద 175 మంది లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వుల పత్రాలను అందించారు.

అలాగే సీఎం కప్ 2025లో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయికి వెళ్లి అక్కడ చక్కటి ప్రతిభ కనబరిచి, బంగారు, వెండి, కాంస్య మెడల్లను సాధించిన క్రీడాకారులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుకరించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు.. జి. సునీత్ కుమార్ - షాట్ పుట్ (జూనియర్ బాలురు అండర్20), జి. సునీత్ కుమార్ - డిస్కస్ త్రో (జూనియర్ బాలురు అండర్20), వి. హారిత - వెయిట్ లిఫ్టింగ్ (జూనియర్ బాలికలు అండర్20), ఎం. రామ్ చరణ్ - పారా సైక్లింగ్.

## వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు

బి. రమ్య - కరాటే (జూనియర్ బాలికలు), టి. సాయి మేఘన రెడ్డి - కరాటే (సబ్ జూనియర్ బాలురు)

## కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు

బి. అజేంద్ర - షాట్ పుట్ (జూనియర్ బాలురు అండర్18), జి. వైశాలి - 100 మీటర్ల పరుగు పందెం (జూనియర్ బాలికలు అండర్20), బి. సోని - జావెలిన్ త్రో (జూనియర్ బాలికలు అండర్20), ఎం. అక్షర దీపిక - బాక్సింగ్ 46 కేజీలు (జూనియర్ బాలికలు అండర్16), బి. శివలక్ష్మి - బాక్సింగ్ 50 కేజీలు (జూనియర్ బాలికలు అండర్16), టి. చరిష్మ - బాక్సింగ్ 57 కేజీలు (జూనియర్ బాలికలు అండర్16), బి. రామ్ చరణ్ - బాక్సింగ్ 44 కేజీలు (జూనియర్ బాలురు అండర్16), జనగామ పుట్ బాల్ జట్టు - మూడవ స్థానం (కాంస్య పతకం). అనంతరం వేసవి శిబిరాల నిర్వహణలో కేజీబీవీ బచ్చన్నపేట, పీఎం శ్రీ జెడ్పీఎస్ఎస్, కేజీబీవీ చౌడారం ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తదనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా (62) రైతు సేవా కేంద్రాల శిలాఫలకాన్ని, అలాగే వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. అదే విధంగా భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (ALIMCO)/సమగ్ర శిక్ష అధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల (12) పిల్లలకు ఉచిత ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, తహసీల్దార్లు, ప్రజలు, విద్యార్థులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.









# కేసీఆర్ ఆనవాళ్లు తొలగించలేరు..

- **కాంగ్రెస్ పాలనలో రైతులు గోస పడుతున్నరు**
- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ఉద్యమం, కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధి ఫలితాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రైతులు పంట పండించడంలో కాకుండా పండించిన ధాన్యాన్ని విక్రయించడంలోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జూన్ 2 తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన ఉద్యమానికి కేసీఆర్ నాయకత్వం వహించి అహింసా మార్గంలో రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. 70 ఏళ్ల అన్యాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో గణనీయంగా సరిచేసిందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, కాకతీయ కళాతోరణం వంటి చిహ్నాలను అవమానించే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. కేసీఆర్ ఆనవాళ్లను తొలగిస్తామనే వ్యాఖ్యలు అభివృద్ధి చరిత్రను చెరిపివేయాలనే ప్రయత్నమని విమర్శించారు. రాష్ట్రంలో సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ సెంటర్, మెడికల్ కాలేజీలు, దేవాదుల, కాళేశ్వరం ప్రాజెక్టులు బీఆర్ఎస్ పాలనకు నిదర్శనాలని తెలిపారు. ప్రస్తుతం రైతులు ధాన్యం విక్రయంలో లారీలు, గన్నీ బ్యాగుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా కోర్టులో ఆవిర్భావ వేడుకలు



జనగామ, మన చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. హైకోర్టు ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుమతి మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనగామ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర్ శ్రీదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ హాలులో అధ్యక్షుడు బండా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అమరుల స్మారకార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. శశి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండా దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజయ్య, పలువురు న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే..

**– మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి**



**జనగామ, మన చౌరాస్తా:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, జనగామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ముఖ్య నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాల ఫలితమని, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చొరవతో ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా నాయకులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొత్త కరుణాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## నాడు తెలంగాణ పోరు..

# నేడు బతుకు పోరు..

- **ఉద్యమంలో కాళ్లకు గజ్జె కట్టి గర్జించిన ప్రణీత**
- **ఇప్పుడు పెట్రోల్ బంక్‌లో దినసరి కూలీ..**
- **కళాకారులను గుర్తించి ఆదుకోవాలని వేడుకోలు**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం నింపిన ఉద్యమ కళాకారిణి సిద్ధమల్ల ప్రణీత ప్రస్తుతం పెట్రోల్ బంక్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించిన ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమ కళాకారుల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే ఉద్యమ కళాకారుల జీవితాలు మెరుగుపడతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నామని ప్రణీత తెలిపారు. ఉద్యమ సమయంలో ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచి రాష్ట్ర సాధనలో తమ వంతు పాత్ర పోషించామని చెప్పారు. అయితే తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా తమ పరిస్థితుల్లో మార్పు రాలేదని వాపోయారు. ఒకప్పుడు ఉద్యమ గీతాలతో ప్రజలను ఉత్తేజపరిచిన తన గొంతు, కాళ్ల గజ్జెల సవ్వడి.. నేడు బతుకుదెరువు భారంతో మూగబోయాయన్నారు. కుటుంబ పోషణ కోసం పెట్రోల్ బంక్‌లో దినసరి కూలీగా మారానని వాపోయారు. తనతో పాటు అనేక మంది ఉద్యమ కళాకారులు పరిస్థితి ఇలానే ఉందన్నారు. అర్హులైన కళాకారులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన, సొంత ఇళ్లు లేని పేద కళాకారులకు గృహాలు మంజూరు చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి

**– వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచన**



భీమదేవరపల్లి, మన చౌరస్తా: హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ. అప్పయ్య మంగళవారం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల రికార్డులు, మందుల నిల్వలు, వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమైన ఆయన, జిల్లాలో మరో పది రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున వడదెబ్బ నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పూర్తిచేయడంతో పాటు బీపీ, షుగర్ బాధితులకు క్రమం తప్పకుండా ఫాలోఅప్ సేవలు అందించాలని సూచించారు. 14 సంవత్సరాలు పూర్తైన బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, డెమో అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# వడదెబ్బతో రైతు మృతి

భీమదేవరపల్లి, మన చౌరస్తా: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన రైతు బరిగె బుచ్చయ్య (58) వడదెబ్బతో మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం, రెండు రోజుల క్రితం వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆయన అస్వస్థతకు గురయ్యారు. వడదెబ్బ ప్రభావంతో ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుచ్చయ్య గతంలో వంగర గ్రామ ఉపసర్పంచ్‌గా సేవలందించి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

# స్టేషన్ ఘనపూర్ రూపురేఖలు మారుస్తా

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కన్నాయిపల్లిలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రాజకీయాలకు అతీతంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామంలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతనంగా నిర్మించిన ఏడు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం రూ.7.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ఎంపీ నిధుల కింద రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నాయిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు, 40 ఇళ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. లబ్ధిదారులు జూలై చివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. త్వరలోనే రెండో విడతలో మరో 10 ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ఈజీఎస్, ఎస్సీపీ, ఎస్డీఎఫ్ నిధుల కింద మొత్తం రూ.35 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదనంగా పంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మహిళా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి సమస్యలను పరిష్కరించి దేవాదుల ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను కన్నాయిపల్లి చెరువుకు తీసుకువచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని, అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, సర్పంచ్ లోనే అంజమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. వేడుకల్లో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# అమరుల త్యాగాలతోనే స్వరాష్ట్రం

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్





**వరంగల్, మన చౌరాస్తా:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలను శాలువాలతో సత్కరించి సన్మానించారు. అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమంలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. దశాబ్దాల పోరాటం, వేలాది ఉద్యమకారుల త్యాగాలు, అమరవీరుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఈ దినోత్సవాన్ని ప్రతి తెలంగాణవాది గర్వంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని, జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను గుర్తించి సత్కరించడం వారి త్యాగాలకు ఇచ్చే నిజమైన గౌరవమని అన్నారు. ఉద్యమకారుల సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఉద్యమ స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పోరాటాలతోనే తెలంగాణ సాధన

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రఘునాథపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని, ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్, యువజన నాయకుడు దుబ్బాక హరీష్ గౌడ్, జిల్లా నాయకుడు కొర్ర రాజేందర్ నాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ నూనెముంతల యాకస్వామి, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ‘జి.వై.గిరి’ నేటి తరానికి మార్గదర్శి

- జనగామ మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి




**జనగామ, మన చౌరాస్తా:** దార్శనికుడు, ప్రజాకవి జి.వై.గిరి నేటి తరానికి మార్గదర్శి అని జనగామ మాజీ ఎమ్మెల్యే సి.హెచ్. రాజారెడ్డి అన్నారు. సమాజ మార్పు కోసం జీవితాంతం శ్రమించి, ప్రజల పక్షాన నిలిచిన గిరి ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జి.వై.గిరి 24వ వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సోప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ‘మారాలి మన సమాజము’, ‘ఎవరిది ఎక్కువ కులం ఎవరిది తక్కువ కులం’, ‘అక్షరం ముక్క రాకపోతే’ వంటి గిరి రచనలు నేటికీ ప్రజల్లో చైతన్యం నింపుతున్నాయని అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ప్రజానాట్యమండలి వంటి ప్రజా సంఘాల పునర్నిర్మాణంలో గిరి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సమాజంలో దోపిడీ, పీడన ఉన్నంతకాలం గిరి సాహిత్యం చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జి.వై.గిరి ఫౌండేషన్ చైర్మన్ జి. కృష్ణ మాట్లాడుతూ గిరి జీవిత ప్రస్థానం, సాహిత్యంపై మూడు పుస్తకాలను ముద్రిస్తున్నామని, వాటిని నేటి తరానికి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, పన్నీరు సత్యం, అయిలా సోమనర్సింహాచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, చిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్, నల్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.



# గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఆవిర్భావ వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మోతె సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.డి. అహ్మద్ పాషా జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమ చరిత్ర, రాష్ట్ర సాధన కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మోతె సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ ఎం.డి. అహ్మద్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న పోరాట స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అభివృద్ధి పథంలో తెలంగాణ

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, రైతు, యువత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ తెలంగాణ లక్ష్యాల సాధన దిశగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం జనగామ వీవర్స్ కాలనీలో



నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో బీర్ల ఐలయ్య, ధన్వంతి లకావత్, మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాల్గొన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. అదే రోజు సేవాదళ్ నాయకుడు బిర్రు సత్యనారాయణ, బిర్రు రామకృష్ణల తల్లి బిర్రు లక్ష్మి మృతికి వారు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# అమరుల త్యాగాలను విస్మరించిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ నేత కొలుగూరి రాజు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సరైన విధంగా గౌరవించలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేద్కర్ చౌక్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు చేసిన సకల జనుల పోరాటం ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమైందని చెప్పారు. ఉద్యమ సమయంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల సహకారంతో ముందుకు వచ్చిన టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరవీరుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద అమరవీరుల స్థూపంగా గుర్తింపు పొందిన ముల్కనూరు అమరవీరుల స్థూపం ఇప్పటికీ ఆవిష్కరణకు నోచుకోకపోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముల్కనూరు సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్రవంతి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు స్వరూప, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ వర్సిటీ సమావేశానికి

# రైతు యాదగిరి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జూన్ 10న నిర్వహించనున్న 49వ పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశానికి రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామానికి చెందిన రైతు మంతపురి యాదగిరికి ఆహ్వానం అందింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం అధికారిక ఆహ్వాన లేఖ పంపించారు. జూన్ 10న ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో వ్యవసాయ రంగ పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాల పురోగతి, భవిష్యత్ ప్రాధాన్యత అంశాలపై సమగ్ర చర్చ జరగనుంది. ఈ సమావేశంలో రైతుల ప్రయోజనాల దృష్ట్యా నాణ్యమైన పత్తి, మిర్చి విత్తనాల ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయానికి ప్రత్యేక యూనిట్ ఏర్పాటు, నానో యూరియా-నానో డీఏపీ వినియోగంపై క్షేత్రస్థాయి ప్రయోగాలు వంటి అంశాలపై యాదగిరి సూచనలు చేయనున్నారు. వ్యవసాయాభివృద్ధి విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు, అవసరాలను సమావేశంలో ప్రస్తావిస్తానని తెలిపారు.



# మలిదశ ఉద్యమకారుడు చింత ఎల్లస్వామికి సన్మానం

**హైదరాబాద్, మన చౌరాస్తా:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు డాక్టర్ చింత ఎల్లస్వామిని ఘనంగా సన్మానించారు. అలైయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బండారు దత్తాత్రేయ, విద్యాసాగర్ పాల్గొని ఎల్లస్వామిని సత్కరించారు. 2009-2014 మధ్య తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ చింత ఎల్లస్వామి కీలక పాత్ర పోషించారు. భూపాలపల్లి నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు సుమారు 280 కిలోమీటర్ల విద్యార్థి పాదయాత్రకు నాయకత్వం వహించారు. ఉద్యమ సమయంలో ఆయనపై నమోదైన కేసుల కారణంగా రెండుసార్లు జైలు జీవితం గడిపారు. ఐదేళ్లపాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ విద్యార్థులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో విశేష కృషి చేశారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎల్లస్వామిని సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నెల్లుట్లలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు

- సర్పంచ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు

**లింగాలఘణపురం, మన చౌరాస్తా:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నర్సింగ రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ సిబ్బందికి నూనెలు, గ్లౌజులు, సబ్బులు పంపిణీ చేసి వారి సేవలను అభినందించారు. గ్రామ పారిశుధ్యం, అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వీడీసీ చైర్మన్ కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పేదలకు సొంతింటి కల సాకారం కావడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులర్పిస్తూ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**